క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్‌కు వినతి



కమిషనర్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లెందు: మున్సిపల్ కార్మికులకు చెల్లించాల్సిన పెండింగ్ పీఆర్సీ, పీఎఫ్, మేడే కానుకలను తక్షణం చెల్లించాలని టీయూసీఐ డిమాండ్ చేసింది. బుధవారం ఇల్లెందు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేసింది. అనంతరం టీయూసీఐ జిల్లా కార్యదర్శి యాకుబ్‌షావలీ మాట్లాడుతూ... మున్సిపల్ కార్మికుల పెండింగ్ సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరారు. రోజుల తరబడి కార్మికుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవటం లేదన్నారు. కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో మున్సిపల్ కార్మిక సంఘం నేతలు కుమార్, ఉమ, ఎల్లబాయి, దుర్గ, వెంకన్న, వీరస్వామి, పద్మ, రాజు, వరలక్ష్మి, నాగమణి, కృష్ణ, జ్యోత్స్న పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించండి..



అజయ్‌కి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పాల్వంచ: డిప్లొమా పూర్తి చేసిన ఓఅండ్‌ఎం ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (హెచ్ 64) నాయకులు కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధలో జెన్‌కో డైరెక్టర్ (హెచ్ఆర్) అజయ్‌ని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గతంలో కోర్టుకు వెళ్లగా పదోన్నతులు ఇవ్వమని ఆదేశాలు కూడా వచ్చినట్లు చెప్పారు. దీనివల్ల సంస్థకు ఎలాంటి నష్టం లేదన్నారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.సుధాకర్, జాన్ వెస్లీ, శంకర్, రాజేష్, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

జూలూరుపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన ఏఐఎస్ఎఫ్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర విద్యాశాఖ మంత్రిని నియమించి, అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు అవుతున్నా విద్యార్థుల సమస్యలపై సమీక్షించకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు రామ్‌చరణ్, పునీత్‌కుమార్, సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా సర్వే



కొత్తూరులో రాత్రిపూట సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్

ఇల్లెందురూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే మండలంలో వేగవంతంగా సాగుతోంది. ఎన్యుమరేటర్లు రోజువారీ లక్ష్యాలకు అనుగుణంగా సర్వే కొనసాగిస్తున్నారు. ప్రజలు ఉదయం కూలీ పనులకు వెళ్తుండటంతో పలు గ్రామాలలో ఎన్యుమరేటర్లు రాత్రి వేళ కూడా సర్వే చేపడుతున్నారు. పలు గ్రామాలలో సర్వే ప్రక్రియను బుధవారం ఎంపీడీఓ ధన్‌సింగ్, తహసీల్దార్ కోట రవికుమార్ పరిశీలించి ఎన్యుమరేటర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వే ప్రారంభంలో కొంత ఇబ్బంది కలిగినా క్రమంగా వేగం పుంజుకుందని, ప్రజలందరూ సర్వేకు సహకరిస్తున్నారని చెప్పారు.

గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ కార్యదర్శిగా మహేష్

కొత్తగూడెంరూరల్: తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శిగా డిప్యూటీ తహసీల్దార్ యు.మహేష్‌ను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వినియోగంలోకి వచ్చేనా?

- శుభకార్యాలకు అవస్థలు పడుతున్న ముస్లింలు
- నిధుల కేటాయింపులో అధికారుల నిర్లక్ష్యం
- కబ్జాకు గురవుతున్న షాదీఖానా పరిసర ప్రాంతం



ప్యూన్‌బస్తీలోని షాదీఖానా

కొత్తగూడెంఅర్బన్: సామాన్య ప్రజలు ఫంక్షన్ హాళ్లలో శుభకార్యాలు చేసుకోవాలంటే ఆందోళన చెందే పరిస్థితి కొత్తగూడెం మున్సిపాలిటీలో ఉంది. మున్సిపాలిటీకి సంబంధించిన ఫంక్షన్ హాళ్లు పట్టణంలో లేకపోవడం వలన పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు ఫంక్షన్ హాళ్లలో శుభకార్యాలు జరపాలంటే రూ.లక్షల్లో ఖర్చు అవుతుంది. దీంతో ఇంటి వద్ద స్థలం ఉన్నా లేకపోయినా ఇబ్బందులు పడుతూనే శుభకార్యక్రమాలు నిర్వహించుకుంటున్నారు. మున్సిపల్ నిధులు రూ.లక్షలు వెచ్చించి నిర్మాణం చేపట్టిన ఫంక్షన్ హాల్ ప్రారంభానికి నోచుకోకుండానే శిథిలావస్థకు చేరింది. పట్టణ పరిధిలోని ప్యూన్‌బస్తీ ఏరియాలో షాదీఖానా దశాబ్దం క్రితం నిర్మించారు. వివిధ కారణాలతో దానిని ప్రారంభించనే లేదు. దీంతో కాలక్రమేణా ప్రస్తుతం అది శిథిలావస్థకు చేరుకుంది. షాదీఖానా అభివృద్ధికి మైనార్టీ సంక్షేమ శాఖ, మున్సిపల్ శాఖ, ఉర్దూ అకాడమీ, ఎమ్మెల్యే ఫండ్ నుంచి నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తే పేద, మధ్యతరగతి ముస్లింలు శుభకార్యాలు నిర్వహించేందుకు ఉపయోగంగా ఉంటుంది. కానీ ఏ శాఖ కూడా షాదీఖానా అభివృద్ధికి చర్యలు తీసుకోకపోవడం వలన స్థానిక ముస్లింలు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా ప్యూన్‌బస్తీలోని టీటీడీ కళ్యాణ మండపం కూడా వినియోగంలో లేదు. దీని వలన ప్యూన్‌బస్తీ ప్రజలు, పాతకొత్తగూడెం నుంచి సింగరేణి ఆస్పత్రి వరకు ఉన్న ప్రజలు, హెడ్డాఫీసు సెంటర్‌లోని ప్రజలు ఫంక్షన్ హాళ్లు స్థానికంగా లేకపోవడం వలన ఇబ్బందులు పడుతున్నారు. షాదీఖానాకు నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది. దీంతో పాటుగా ముస్లింల సౌకర్యార్థం ఉర్దూ లైబ్రేరీ కూడా ఏర్పాటు చేయాలని ముస్లింలు కోరుతున్నారు.

ఉర్దూఘర్ కమిటీకి షాదీఖానా బాధ్యతలు...

కొత్తగూడెం పట్టణ పరిధి పాతబస్ డిపో సెంటర్‌లోని ఉర్దూఘర్ కమిటీ షాదీఖానా బాధ్యతలు కూడా స్వీకరించాలని జిల్లా మైనార్టీ శాఖ వారు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. అయితే బాధ్యతను కమిటీ అప్పగించి కూడా 40 రోజులు అవుతున్నా ఇంత వరకు ఎటువంటి ముందడుగు పడలేదు. అయితే గతంలో షాదీఖానా స్థలం ఎంత వరకు కేటాయించారు, ప్రస్తుతం ఎంత ఉంది, ఎంత కబ్జాకు గురయింది అనే విషయాలపై సర్వే నిర్వహించి అనంతరం నిధుల మంజూరుకు కృషి చేసే ఆలోచనలో షాదీఖానా కమిటీ వారు ఉన్నట్లు తెలుస్తోంది. త్వరితగతిన సర్వే పూర్తి చేసి నిధులు మంజూరు చేసి షాదీఖానాను అభివృద్ధి చేస్తే స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

నిధులను సద్వినియోగం చేసుకోలేక...

పట్టణ పరిధి ప్యూన్‌బస్తీ ఏరియాలోని షాదీఖానాకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ వారు 2017లో అభివృద్ధి కొరకు రూ.11 లక్షలు విడుదల చేశారు. అయితే అప్పట్లోనే మొదట విడతగా రూ.2.23 లక్షలు, రెండో విడతగా రూ.4.02 లక్షలు నిర్మాణాలకు ఖర్చు చేశారు. ప్రస్తుతం రూ.4.74 లక్షలు షాదీఖానా నిధులున్నాయి. వాటిని వినియోగించడంలో కూడా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఉన్న నిధులను వినియోగించి షాదీఖానాను అభివృద్ధి చేసి శుభకార్యక్రమాలకు అద్దెకు ఇస్తే ఆదాయం వస్తుందని ముస్లింలు చెబుతున్నారు. లేకపోతే మున్సిపాలిటీ వారు నిధులు కేటాయించి అభివృద్ధి చేసినా మున్సిపాలిటీకి అదనంగా ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందంటున్నారు. ప్రస్తుతం షాదీఖానా బాధ్యతలను అప్పగించిన ఉర్దూఘర్ కమిటీ వారు కానా, మున్సిపల్ అధికారులు కానా చర్యలు చేపట్టి త్వరితగతిన షాదీఖానా పునఃనిర్మాణం చేసి అందుబాటులోనికి తీసుకరావాలని స్థానికులు కోరుతున్నారు. లేదంటే షాదీఖానా స్థలం పూర్తిస్థాయిలో కబ్జాకు గురయ్యే అవకాశం ఉంటుంది.

నిధులు సద్వినియోగం చేసుకోవాలి



కొత్తగూడెం పట్టణ పరిధి ప్యూన్‌బస్తీలోని షాదీఖానాను అభివృద్ధి చేసి అద్దెకు ఇస్తే ఆదాయం సమకూరుతుంది. షాదీఖానాకు సంబంధించిన నిధులు ప్రభుత్వ ఖాతాలో ఉన్నాయి. ప్రైవేటు ఫంక్షన్ హాళ్లకు రూ.లక్షలు ఖర్చు పెట్టలేక ఎంతోమంది అవస్థలు పడుతున్నారు. జిల్లా అధికారులు, మున్సిపల్, మైనార్టీ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఎండీ యాకూబ్‌పాషా, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు

ఇల్లెందు ఏరియాలో డైరెక్టర్(పా) పర్యటన



గుర్తింపు సంఘం నేతలతో మాట్లాడుతున్న డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి

ఇల్లెందు: సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు) జి.వెంకటేశ్వరరెడ్డి బుధవారం ఇల్లెందు ఏరియాలో పర్యటించారు. ఈ సందర్భంగా అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ.. జేకే ఓసీకి సంబంధించి మొదటి దశ అనుమతులు వచ్చాయని తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి బొగ్గు ఉత్పత్తికి సిద్ధం కావాలని సూచించారు. వాసిరెడ్డి సీతారామయ్య, రాజ్‌కుమార్, సారయ్య, నజీర్ అహ్మద్ పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని సెక్యూరిటీ కార్యాలయం, జీఎం కార్యాలయాన్ని బుధవారం సెక్యూరిటీ జీఎం చందా లక్ష్మీనారాయణ సందర్శించారు. జీఎం శాలేంరాజు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. సెక్యూరిటీ జీఎం మాట్లాడుతూ.. సింగరేణి ఆస్తుల పరిరక్షణలో సెక్యూరిటీల పాత్ర కీలకమన్నారు.

జీఎంను కలిసిన పిట్ కమిటీ



పిట్ కార్యదర్శుల జాబితాను జీఎం పర్సనల్‌కు అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా సింగరేణి హెడ్డాఫీస్‌లో పనిచేస్తున్న ఏఐటీయూసీ పిట్ కమిటీని బుధవారం జీఎం పర్సనల్ (ఐఆర్‌పీఎం) కవితా నాయుడుకు ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి పరిచయం చేశారు. వాసిరెడ్డి మాట్లాడుతూ.. హెడ్డాఫీస్ ఉద్యోగస్తుల సమస్యలపై స్పందిస్తూ వాటి పరిష్కారం కోసం యూనియన్ పిట్ కమిటీ సభ్యులు కృషి చేస్తారని తెలిపారు. ఈ విషయంలో వారు ఏమైనా సమస్యలు మీ దృష్టికి తీసుకొస్తే, వాటిని వీలైనంత త్వరలో పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, సెంట్రల్ కార్యదర్శి వంగా వెంకట్, పిట్ కార్యదర్శి శ్యామ్, కిరణ్, రామకృష్ణ, రంజీత్, సౌమ్య, అపర్ణ పాల్గొన్నారు.

ఎన్యుమరేటర్లకు పనిభారం తగ్గించాలి

జూలూరుపాడు: కులగణన సర్వే చేసే ఎన్యుమరేటర్లకు పనిభారం తగ్గించాలని టీటీఎఫ్‌టీఎస్ మండల అధ్యక్షుడు ధరావత్ హనుమా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎన్యుమరేటర్లుగా నియమించబడిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పనిభారం తగ్గించాలన్నారు. సర్వే చేసిన కుటుంబాల ఆధారంగా ఎన్యుమరేటర్లకు రెమ్యూనేషన్ ఇవ్వాలని కోరారు.

ప్రతీ ఎన్యుమరేటర్‌కు 100 కుటుంబాలు కేటాయించాలని, 150, 175, 200 కుటుంబాలు సర్వేకు కేటాయించడంతో తలకు మించిన భారంగా మారిందన్నారు. ఈ విషయంపై కలెక్టర్ దృష్టి సారించి ఎన్యుమరేటర్ల సంఖ్య పెంచే విధంగా చూడాలని కోరారు.

సింగరేణి క్రీడలకు ప్రాధాన్యం ఇస్తుంది..



క్రీడాకారులతో సింగరేణి అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): కార్పొరేట్ ఏరియా డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ ఆధ్వర్యంలో హాకీ, క్యారమ్స్ పోటీలను బుధవారం కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో సీనియర్ పీఓ, స్పోర్ట్స్ ఆఫీసర్ టి.శ్రీనివాస్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వటమే కాకుండా వాటికి కొంత బడ్జెట్ కేటాయించి, ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహిస్తుందన్నారు. సంస్థలో పనిచేసే అధికారులు, ఉద్యోగులు, కార్మికులు ఏదో ఒక క్రీడను ఎంచుకొని ప్రతీరోజు ఆడాలని, తద్వారా వారి శారీరక దారుఢ్యం పెరుగుతుందన్నారు. క్రీడలు ఆడటం వలన శరీరంలో రక్త ప్రసరణ పెరిగి, మెదడును చురుకుగా ఉండేలా చేస్తుందన్నారు. క్రీడాకారులలో ఏరియా లెవల్, కంపెనీ లెవల్లో రాణించినట్లే, కోలిండియా స్థాయి పోటీల్లో కూడా విజయ కేతనం ఎగురవేయాలని, సింగరేణి కీర్తిని కోలిండియాలో ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. ఈరోజు జరిగిన హాకీ పోటీల్లో కార్పొరేట్ టీమ్‌పై 3-0 గోల్స్‌తో విజయం సాధించారని, వీరు ఈనెల 19, 20తేదీలలో మణుగూరులో జరగనున్న కంపెనీ లెవల్ పోటీలో ఆడనున్నట్లు చెప్పారు. అదేవిధంగా క్యారమ్స్ విజేతలు ఈనెల 26, 27 తేదీలలో భూపాలపల్లిలో జరగనున్న పోటీలలో పాల్గొంటారని తెలిపారు. గుర్తింపు సంఘం నాయకులు రమణమూర్తి, ప్రాతినిధ్య సంఘం నాయకులు పీతాంబరరావు, సీఎంఓఏఐ జాయింట్ సెక్రటరీ హరిప్రసాద్, పాసినెట్, క్రీడాకారులు పాల్గొన్నారు.

సామూహిక క్షీరాబ్ధి ద్వాదశి వ్రతం



హాజరైన భక్తులు

పాల్వంచ: శ్రీరామాలయ భజన మందిర స్థలంలో బుధవారం సాయంత్రం సామూహిక క్షీరాబ్ధి ద్వాదశి వ్రతం, తులసీ దామోదర కల్యాణం ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త బ్రహ్మశ్రీ చిర్రావూరి, యాజ్ఞికులు గొడవర్తి సంపత్ కుమార్ అప్పలాచార్యులు ఆధ్వర్యంలో భక్తులచే లక్ష దీపోత్సవం నిర్వహించారు.

పత్తి కొనుగోళ్ల పరిశీలన



పత్తిని పరిశీలిస్తున్న ఏఓ

సుజాతనగర్: స్థానిక జిన్నింగ్ మిల్లులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఏఓ నర్మద బుధవారం సందర్శించారు. కొనుగోలు, పత్తిలోని తేమ శాతాన్ని పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారంగా కొనుగోళ్లు చేయాలని వ్యాపారులకు సూచించారు. రైతుల వేలిముద్రలతో కూడిన ఆధార్ అనుసంధానం, ఓటీపీ విధానం తదితర విషయాల్లో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా చూడాలన్నారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా, సీసీఐ కేంద్రాలలోనే విక్రయించి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర పొందాలని తెలిపారు.

కఠినంగా శిక్షించాలి

జూలూరుపాడు: స్వాతి అనే మహిళను దారుణంగా హత్య చేసి పూడ్చి పెట్టిన నిందితులు బానోత్ వీరభద్రం, సరోజలను కఠినంగా శిక్షించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా పార్టీ మండల కార్యదర్శి బానోత్ ధర్మా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జూలూరుపాడులో ఆయన మాట్లాడుతూ.. ప్రియురాలు స్వాతిని ప్రియుడు వీరభద్రం నమ్మించి మోసం చేసి హత్య చేసి పత్తి చేనులో పూడ్చి పెట్టడం సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునేలా ఉందన్నారు. ఆడపిల్లలు, మహిళల హక్కుల కోసం ఎన్ని చట్టాలు ఉన్నప్పటికీ వారికి రక్షణ కరువైందన్నారు. నిందితుడు వీరభద్రంపై నిర్భయ చట్టం కింద కేసు నమోదు చేసి శిక్షించాలన్నారు. వై.గోపాల్‌రావు, రాయల సిద్ధు, మధు, శ్రీను పాల్గొన్నారు.

నాటు సారా స్వాధీనం

టేకులపల్లి: మండల కేంద్రంలోని దాసుతండాలో టేకులపల్లి ఎస్ఐ పి.సురేష్ ఆధ్వర్యంలో బుధవారం తనిఖీలు నిర్వహించారు. బాణోతు రాము ఇంట్లో సుమారు నాలుగు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. గొలియాతండాలో ఎక్సైజ్ శాఖతో కలిసి తనిఖీలు నిర్వహించి సుమారు 15 లీటర్ల బెల్లం పానకాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రికార్డులను పరిశీలిస్తున్న నోడల్ అధికారి వెంకటేశ్వరరావు

పాల్వంచరూరల్: ఇంటర్మీడియట్‌లో ఈ సంవత్సరం వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఇంటర్మీడియట్ నోడల్ ఆఫీసర్ హెచ్.వెంకటేశ్వరరావు ఆదేశించారు. మండల పరిధి బస్వతారక కాలనీ గ్రామపంచాయతీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులకు సంబంధించిన హాజరు రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు పరీక్షలకు సిద్ధం కావాలని, పరీక్ష ఫీజు చెల్లింపుల విషయంలో హాజరు శాతాన్ని ఎలా పెంచుకోవాలన్న విషయాలు, వృత్తి విద్యాకోర్సులపై సమీక్షించారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా శ్రద్ధతో చదువుకుని అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. కళాశాల పురోభివృద్ధికి కృషి చేస్తున్న ప్రిన్సిపాల్ శంకర్‌తోపాటు సిబ్బందిని అభినందించారు.

రేపు మాల ఉద్యోగుల ఆత్మగౌరవ సభ



మాట్లాడుతున్న విజయభాస్కర్‌రావు

పాల్వంచ: ఈ నెల 15వ తేదీన ఖమ్మంలో ఒయాసిస్ రిసార్ట్స్‌లో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా జరగనున్న మాల ఉద్యోగుల, విద్యుత్ ఉద్యోగుల, రక్త బంధువుల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని జాతీయ మాల విద్యుత్ ఉపకులాల సంఘం జాతీయ అధ్యక్షుడు బూర్గుల విజయభాస్కర్ రావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సంఘ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ సభకు ఎమ్మెల్యేలు గడ్డం వివేక్, కేఆర్ నాగరాజు, వంశీకృష్ణ, సత్యం, మట్టా రాగమయి, జాతీయ మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జి.చెన్నయ్య హాజరవుతారన్నారు. ఎస్సీలను వర్గీకరించడం ద్వారా ప్రభుత్వానికి ఉపయోగం తప్ప, మాలలకు ఒరిగిందేమీ లేదన్నారు. నాయకులు వైడీ.వినయ్ రాజ్, సంపత్, వల్లమల్ల జాకో, చాడ శ్రీనివాస, రామచందర్, నల్లబెల్లి రాంబాబు, తుంపుడు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వెంకన్న

పాల్వంచరూరల్: విద్యార్థులు కష్టపడి కాకుండా.. ఇష్టపడి చదువుకోవాలని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వ్యక్తిత్వ వికాస నిపుణులు గంగావత్ వెంకన్న అన్నారు. మండల పరిధి కిన్నెరసానిలోని గిరిజన ఆశ్రమ స్పోర్ట్స్ స్కూల్, ఉల్వనూరులోని బాలికల ఆశ్రమ పాఠశాలలో బుధవారం వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భగా వెంకన్న మాట్లాడుతూ... జీవితంలో భయం ఉన్నప్పుడు ఏమీ సాధించలేమన్నారు. భయాలను వీడి లక్ష్యసాధనకు ధైర్యమే సాహసంగా ముందుకు సాగాలన్నారు. పదో తరగతి విద్యార్థులు ముఖ్యంగా పరీక్షల సమయంలో భయపడకుండా ప్రణాళికా బద్ధంగా చదువుకుంటే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు సహకరించండి..



ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

టేకులపల్లి: గంజాయి వల్ల అనేక అనర్థాలు ఉన్నాయని, వాటికి దూరంగా ఉంటేనే యువతకు మంచి భవిష్యత్ ఉంటుందని టేకులపల్లి సీఐ తాటిపాముల సురేష్, టేకులపల్లి ఎస్ఐ పోగుల సురేష్, ఎక్సైజ్ ఎస్ఐ అచ్చారావు అన్నారు. ఈ మేరకు బుధవారం టేకులపల్లిలో డ్రగ్స్ రహిత సమాజం అందరి బాధ్యత అని నినదిస్తూ టేకులపల్లి సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. గంజాయికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం గంజాయి వల్ల కలిగే నష్టాలను వివరించారు. సమాజంలో ఎక్కడైనా గంజాయి విక్రయాలు జరుగుతున్నా, ఎవరైనా గంజాయి వినియోగిస్తున్నా సమాచారం తెలిస్తే 100 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని, సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని పేర్కొన్నారు. అనంతరం స్నిఫర్ డాగ్‌తో మండల కేంద్రంలో డ్రగ్స్ కోసం తనిఖీలు నిర్వహించారు. గతంలో మాదకద్రవ్యాలు, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించిన పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. సమాజం నుంచి గంజాయిని తరిమివేసేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

విద్యార్థులు లక్ష్యాలు సాధించాలి



విద్యార్థులకు సూచనలు చేస్తున్న త్రీటౌన్ సీఐ శివప్రసాద్

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని త్రీటౌన్ పోలీసు స్టేషన్ సీఐ శివప్రసాద్ తెలిపారు. బుధవారం కూలీలైన్ ప్రభుత్వ పాఠశాలలో గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల వినియోగం – అనర్థాలపై అవగాహన సమావేశం నిర్వహించి మాట్లాడారు. సమాజంలో కొంతమంది విద్యార్థులు చెడు అలవాట్లకు మొగ్గు చూపుతూ వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. వారిపై తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలను ఆవిరి చేస్తున్నారని, అది సరైన పద్ధతి కాదన్నారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు బాగా చదువుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకరావాలన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని జీవితంలో బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇకనైనా కొత్త భవనంలోకి వెళ్లరా..?

- నేటి నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు
- నిరుపయోగంగా నూతన భవనం



ప్రారంభోత్సవానికి నోచుకోని గ్రంథాలయ నూతన భవనం

ఇల్లెందు: ఏడాది క్రితం నూతన గ్రంథాయల భవన నిర్మాణం పూర్తయింది. కానీ జనవరిలో వేసిన తాళాలు నవంబర్ నాటికీ తెరుచుకోనే లేదు. ఇక అధికారులు ప్రారంభోత్సవాన్నే మరిచారు. దీంతో రూ.2 కోట్లతో నిర్మించిన నూతన గ్రంథాలయ భవనం నిరుపయోగంగా మారింది. గంపెడు ఆశలు పెట్టుకున్న నిరుద్యోగులు నిరాశ చెందుతున్నారు. ఇకనైనా గ్రంథాలయ వారోత్సవాల వేళ నూతన భవనంలోకి అడుగుపడేనా అంటూ నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఈ నెల 14 నుంచి 20 వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల వేళ అయినా డిజిటల్ గ్రంథాలయం నిరుద్యోగుల ముంగిటకు చేరుతుందని ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇల్లెందు పట్టణంలో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ఎదురుగా నిర్మాణమైన నూతన గ్రంథాలయ భవనం ప్రారంభోత్సవానికి గ్రహణం పట్టింది. ఇల్లెందు జేకే ఏరియాలో డిజిటల్ లైబ్రరీ నిర్మాణాన్ని గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ విభాగం పర్యవేక్షణలో నిర్ణయించిన కాల పరిధిలో నిర్మాణం పూర్తి చేశారు. కానీ ప్రారంభోత్సవానికే ముహూర్తం కుదరడం లేదు.

నిరుద్యోగుల పాలిట కల్పతరువు...

గ్రంథాలయాల వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయి. అయినా పాలకులు వీటిని పట్టించుకోవటం లేదు. పోటీ పరీక్షలకు సిద్ధం అయ్యే నిరుద్యోగులు ఈ డిజిటల్ లైబ్రరీ ద్వారా ప్రయోజనం పొందే అవకాశం ఉంది. ముఖ్యంగా ఆన్‌లైన్‌లో అవసరమైన సమాచారం ఈ గ్రంథాలయం ద్వారా పొందే మార్గం సులభం కానుంది. సుదూర ప్రాంతాలకు వెళ్లి రూ.లక్షలు వెచ్చించి కోచింగ్‌లు పొందే నిరుద్యోగులు ఇల్లెందులోని డిజిటల్ లైబ్రరీలో అందుబాటులో ఉన్న పుస్తకాలు, దిన, పక్ష, మాస పత్రికలతో పాటు డిజిటల్ సేవలు వినియోగించుకునే అవకాశం ఉంది.

డిజిటల్ లైబ్రరీలో సదుపాయాలు ఇలా...

ఇల్లెందులో రూ. కోటి తో నిర్మించిన డిజిటల్ లైబ్రరీలో రీడింగ్ హాల్, కంప్యూటర్ల గది, బుక్స్ కోసం ప్రత్యేక గది, దిన, పక్ష, మాస పత్రికలు చదువుకునేందుకు హాల్, లైబ్రేరియన్ గది, విద్యుత్ సదుపాయం, ఫ్యాన్లు, తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉంటాయి. అన్ని రకాల పుస్తకాలు, పత్రికలు, టీవీ అందుబాటులో ఉంటాయి.